క్లుప్తంగా

మట్టి గణపతి విగ్రహాలకు జై కొడదాం

రేగొండ: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతి విగ్రహాలనే పూజిద్దామని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి అన్నారు. వినాయక చవితికి మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని తద్వారా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ జరుగుతుందని తెలిపారు. మట్టి త్వరగా నీళ్లలో కరిగిపోతుందని తద్వారా జీవ కోటికి నష్టం జరగదని పేర్కొన్నారు .మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ముఖ్యంగా రంగులు వేసిన వినాయక విగ్రహాలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో చెరువులు, కుంటలు, సరస్సులు కాలుష్య కారకాల వల్ల జీవరాసులు మృత్యు వాత పడే ప్రమాదముందన్నారు.

జిల్లా స్థాయిలో విష్ణుకు ప్రథమ బహుమతి

టేకుమట్ల: పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించుటలో భాగంగా జిల్లా సైన్స్ డిపార్ట్‌మెంట్ నిర్వహించిన మట్టి వినాయకుల తయారీలో మండలంలోని గర్మిళ్లపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విష్ణు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి చేతుల మీదుగా అవార్డు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దొమ్మటి శంకర్, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి


రవి (ఫైల్)


టేకుమట్ల (రేగొండ): ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందిన సంఘటన రేగొండ మండలంలోని జగ్గయ్యపేట శివారు ఎస్సారెస్పీ కెనాల్ వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపల్లి (గోరి) మండలంలోని వెంకటేశ్వర్లపల్లికి చెందిన వేముల రవి (60) రైతు పరకాల నుంచి వెంకటేశ్వర్ల పల్లికి ఎరువుల బస్తాలను ఆటోలో తీసుకొస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడటంతో రవికి తీవ్ర గాయాలయ్యాయి. జగ్గయ్యపేటకు చెందిన ఆటో డ్రైవర్ సాంబయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం రవిని ఎంజీఎం ఆస్పత్రికి, సాంబయ్యను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా రవి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. శనివారం మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

పాము కాటుతో చిన్నారి మృతి


లాస్య(ఫైల్)

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని మంజూరునగర్‌లో శుక్రవారం రాత్రి పాము కాటుతో చిన్నారి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంజూర్‌నగర్‌కు చెందిన గంట ప్రదీప్ కూతురు లాస్య(4) రాత్రి 9.30 గంటలకు ఇంట్లోని కుటుంబ సభ్యులంతా నేలపైనే పడుకుంది. నిద్రలోకి చేరుకున్న తర్వాత నాగుపాము ఇంట్లోకి వచ్చి కాటు వేసినట్లు తెలిపారు. వెంటనే మంజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి అక్కడి నుంచి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చిక్సిత పొందుతూ అర్ధరాత్రి చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య


దేవేందర్ (ఫైల్)

గణపురం : మండలంలోని బస్వరాజుపల్లికి చెందిన బండారి దేవేందర్(48) రైతు అప్పుల బాధ భరించలేక తన మిరుప తోటకు కొట్టిన పురుగుల మందునే తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బస్వరాజుపల్లికి చెందిన దేవేందర్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనకున్న రెండెకరాల్లో మిర్చి పంటను సాగు చేస్తుండడంతో పాటు మరో రెండెకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. కొద్ది రోజుల క్రితం వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో కాలుకు ఇనుప చువ్వ కుచ్చుకుని ఇన్‌ఫెక్షన్ అయ్యింది. ఆపరేషన్ కోసం రూ. 5లక్షల అప్పు చేశాడు. గత సంవత్సరం మిర్చి పంటలో కూడా నష్టం రావడంతో సుమారు రూ. 10 లక్షల వరకు అప్పు చేయడంతో మనస్తాపానికి గురైన దేవేందర్ శనివారం తన మిర్చి తోటలో కొట్టగా మిగిలిన పురుగుల మందును ఇంటికి తీసుకచ్చి తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఆయనను భూపాలపల్లిలోని ఒక ప్రైవేటు ఆత్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య స్వరూప, కుమారులు రమేష్, రాజ్‌కుమార్‌లు వున్నారు.

పశుపోషణలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

- మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాజన్న
- కాటారంలో పశువైద్య శిబిరం, అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త రాజన్న

కాటారం: పశుపోషకులు పశుపోషణలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త రాజన్న అన్నారు. కాటారం పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం మామునూర్, పశువైద్య, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశుధన్ జాగృతి అభియాన్‌లో భాగంగా మండల కేంద్రంలో శనివారం ప్రత్యేక పశువైద్య శిబిరం, పాడి రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. సుమారు 420 పశువులకు చికిత్స చేయడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మామునూరు వెటర్నరీ కళాశాల గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజశ్రీ పశుపోషకులు, రైతులు పశువుల్లో ఎద లక్షణాలు గుర్తించడం, కృత్రిమ గర్భధారణ ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చూడి పశువుల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, పునరుత్పత్తి సమస్యలను గుర్తించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త రాజన్న మాట్లాడుతూ పశువుల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా లాభాలు చేకూరుతాయని తెలిపారు. ఖనిజ లవణాల మిశ్రమం ప్రాముఖ్యత, పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఏకాంబరం మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం సేవలను వినియోగించుకోవాలని సూచించారు. రైతులు, పశుపోషకులు శాస్త్రవేత్తలు, పశువైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని పేర్కొన్నారు. అనంతరం చూడి పశువుల యాజమాన్యంపై కరపత్రం ఆవిష్కరించారు. గొర్లు, మేకలకు సంబంధించిన పోషకులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కేవీకే శాస్త్రవేత్తలు భూపాలపల్లి జిల్లా సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీధర్, ఇండియన్ ఎమ్మినో లాజికల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధు, మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాకేశ్‌శర్మ, డాక్టర్ రమేశ్, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

విలీనంపై బీఆర్ఎస్, బీజేపీ నాటకాలు

- సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ
- జాతీయ సమైక్యతా దినోత్సవం పేరిట బీఆర్ఎస్ డ్రామా
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

భూపాలపల్లి అర్బన్: తెలంగాణ విలీన దినోత్సవంపై కేంద్రం, రాష్ట్రం ప్రభుత్వాలు కపట నాటకాలు ఆడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా భూపాలపల్లిలో సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన, సభ నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అధ్యక్షత ఏర్పాటు చేసిన సమావేశానికి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఈ నెల 17న విమోచన దినోత్సవం పేరిట బీజేపీ, జాతీయ సమైక్యతా దినం పేరిట బీఆర్ఎస్ పార్టీలు చేపట్టిన కార్యక్రమాలు ప్రజలను మధ్య పెట్టేందుకేనని అన్నారు. ట్యాంక్ బండ్‌పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలు పెడతామని, పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ సాయుధ పోరాట పోరాట చరిత్రను చేర్చుతామని చెప్పిన కేసీఆర్ ఎందుకు ఆ హామీలను నెరవేర్చలేదని ప్రశ్నించారు. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ నైజాంపై పోరాటాన్ని హిందూ, ముస్లింల గొడవగా చిత్రీకరిస్తున్నదని అన్నారు. భూస్వాములకు, దోపిడీ దారులకు నైజాం సర్కారు అండగా ఉండడం వల్లనే నైజాం సర్కారుపై సాయుధ పోరాటానికి సీపీఐ పిలుపు నిచ్చిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు మోటపలుకుల రమేష్, సోత్కు ప్రవీణ్‌కుమార్, క్యాతరాజ్ సతీష్, కోరిమి సుగుణ, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, శ్రీనివాస్, విజేందర్, రామచందర్, తాళ్ల పోషం,పురేళ్ళ శ్రీనివాస్, పీక రవి, సాబీర్, తిరుపతి, సుమలత, లావణ్యలు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు పరామర్శ


సర్పంచ్‌ను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహాముత్తారం: మండలంలోని స్తంభంపల్లి(పీపీ) సర్పంచ్ జాడి రాజయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని శనివారం గ్రామంలో మండల కాంగ్రెస్ నాయకులు ఆయను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో పీసీసీ సభ్యుడు బెల్లంకొండ కిష్టయ్య, అధ్యక్షుడు పక్కల నడువలి, కాంగ్రెస్ నాయకులు దుర్గయ్య, వంశీరాజ్, రామగిరి రాజయ్య తదితరులు ఉన్నారు.

ఆట వస్తువుల పంపిణీ


ఆట వస్తువులు అందిస్తున్న ఆర్మీ జవాన్ అశోక్

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ జైరిశెట్టి అశోక్ ఇటీవల సివిల్ ఎస్సైగా ఎంపికైన సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రూ. 10 వేలు విలువ చేసే ఆటవస్తువులు శనివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ గతంలో కార్గిల్ యుద్ధంలో పాల్గొని రిటైర్డ్ అయిన తరువాత సివిల్ ఎస్సైగా సెలక్ట్ అయ్యాయని తెలిపారు. విద్యార్థులు నాలాగే కష్టపడి చదువుకుని దేశసేవలో ముందంజ లో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవింద సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నరసింహస్వామి, ఎన్‌సీసీ అధికారి రాజయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు మొట్లపల్లి డాక్టర్ యాస్మిన్ వైద్యపరీక్షలు నిర్వహించి విద్యార్థులకు ఉన్న అనారోగ్య సమస్యలను పరిష్కరించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యాస్మిన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధులు వాటి నివారణ చర్యల గురించి విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలికలకు పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేకంగా కౌన్సిలింగ్ చేశారు. సమావేశంలో ఉపాధ్యాయులు సంపత్ కుమార్, సదానందం, రవీందర్, ఉమారాణి, శ్రీధర్ స్వామి, మధుసూదన్, రవి ప్రసాద్, ఆశ వర్కర్, ఎన్‌సీసీ విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ


స్కూల్ బ్యాగుల పంపిణీ అనంతరం విద్యార్థులతో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: 'కలిస్ ఏరోస్పేస్ ' యూత్ ఫర్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో శనివారం 70 మంది విద్యార్థిని, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌పుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఫణి, శశిధర్ రావు, రామారావు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో చదువుకొని కన్న తల్లిదండ్రులకు గ్రామానికి దేశానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయురాళ్లు శ్రీదేవి, సాంబరాజులక్ష్మిలతో పాటుగా ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు సుధాకర్ పాల్గొన్నారు.

ఎంజేఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా సతీష్ కుమార్


సతీష్ కుమార్

భూపాలపల్లి రూరల్: మాదిగ జర్నలిస్టుల ఫోరం (ఎంజెఎఫ్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ఆ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంతెన సమ్మయ్య తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎర్రం సతీష్ కుమార్, ఉపాధ్యక్షులుగా దాసారపు ప్రశాంత్, మంత్రి రాజబాబు, ప్రధాన కార్యదర్శిగా కడపాక రవి, అధికార ప్రతినిధిగా చెరుకు సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మారపల్లి చంద్రమౌళి, కోశాధికారిగా రడపాక రమేష్, కార్యదర్శిగా అంబాల రవీందర్, సహాయ కార్యదర్శిగా పుల్ల సృజన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. నూతన అధ్యక్షుడు ఎర్రం సతీష్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంతెన సమ్మయ్యకు, తన ఎన్నికకు సహకరించిన ఎంజేఎఫ్ జిల్లా నాయకులు అంబాల సంపత్, తిక్క ప్రవీణ్ మోకిడి చిరంజీవి, సత్యనారాయణ, రాష్ట్ర ,జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మాకు న్యాయం చేయాలి


జీఓ ప్రతులను చూపిస్తున్న అభ్యర్థులు

భూపాలపల్లి రూరల్ : జిల్లా సంక్షేమ శాఖలోని చైల్డ్‌లైన్ 1098 విభాగంలో జౌట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో మాకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని నలుగురు ఉద్యోగులు జిల్లా ఉన్నతాధికారులను వేడుకున్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా చైల్డ్ విభాగంలో ఎన్‌జీఓ ద్వారా నియమాకమై గత రెండు, మూడేళ్లుగా విధులు నిర్వహించామన్నారు. ఈ శాఖలో 2023 ఆగస్టులో జౌట్ సోర్సింగ్ ద్వారా పోస్టులకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. కొత్త జీఓలు చూపించి అందులో పని చేసిన అనుభవం, కల్గిన మాకు ప్రాధాన్యాత ఇవ్వకుండా, అధికారులు వారి బంధుగణంలో కొత్తవారిని నియమించి మాకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఎన్‌జీఓలో రిక్రూమెంటప్పుడు లేని జీఓలు జౌట్ సోర్సింగ్ నియామకాల్లో ఎలా వర్తిస్తాయన్నారు. కలెక్టర్ స్పందించి మాకు న్యాయం చేయాలని ఉద్యోగులు పులి సుప్రజ, పుట్ట ఆనంద్, పెండ్యాల రమ్య, తులసి, విజయలక్ష్మిలు కోరారు. జిల్లా సంక్షేమాధికారి నాగేశ్వర్‌రావు వివరణ కోరగా ఈ పోస్టులను సెలక్షన్ కమిటీ నిబంధనల మేరకే ఎంపిక చేసి వారి పేర్లను ఏజెన్సీకి పంపించారు. ఇందులో ఎలాంటి అవక తవకలకు అవకాశం లేదు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

మల్హర్: ఈనెల18 నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ మండపాల ఏర్పాటుకు ఉత్సవాల నిర్వహణకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ ప్రతీ మండపానికి ఆన్‌లైన్ ద్వారా అనుమతులు తీసుకోవాలని వెల్లడించారు. దీపారాధనలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదాలు జరగకుండా నిర్వహకులు ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. మట్టితో తయారు చేసిన విగ్రహాలనే పూజించేందుకు ప్రాధాన్యతమివ్వాలని పేర్కొన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థికసాయం

ఏటూరునాగారం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం మారుమూల గ్రామానికి చెందిన సపావట్ రేణుకకు ఆర్థిక కష్టాలున్నాయని సాక్షి పత్రికలో ఈనెల 13న ప్రచురితమైంది. ఈ మేరకు ఐటీడీఏ పీఓ అంకిత్ స్పందించి రేణుకకు శనివారం ఐటీడీఏలో రూ. 35వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కేసముద్రం మండలం సప్పిడి గుట్టతండా గిరిజన తండాలో నిరుపేద బీద కుటుంబంలో సపావట్ రేణుక జన్మించింది. సపావట్ రేణుక పదోవ తరగతి వరకు మహబూబాబాద్ లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదివి ఆ తర్వాత ఇంటర్మీడియట్ కల్వకుర్తిలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో బైపిసి చదివి 884 మార్కులను సాధించింది. ఆ తరువాత ఎంసెట్ పరీక్షలు రాసి ఎస్టీ కోటాలో 4009 ర్యాంకును సాధించింది. దీంతో సిరిసిల్లలోని ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీలో గత ఏడాది బీఎస్సీ అగ్రికల్చర్ సీటు సాధించింది. తరువాత మూడు నెలల్లో తండ్రి మృతి చెందడంతో ఫీజు చెల్లించలేని పరిస్థితి నెలకొంది.

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై స్పష్టం చేయాలి


దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నేతలు

భూపాలపల్లిరూరల్: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టు విజయ్‌కుమార్ మాదిగ అధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. దీక్షలనుద్దేశించి విజయ్ కుమార్ మాట్లాడుతూ బీజేపీ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. కాంగ్రెస్ సీడబ్ల్యూసీ కమిటీలో వర్గీకరణకు మద్దతుగా తీర్మానం చేయాలన్నారు. కేంద్రమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గేలు హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటు చేసే సమావేశాల్లో పాల్గొనే సందర్భంగా వర్గీకరణపై ప్రకటించి చిత్తశుద్ధి చాటుకోవాలని కోరారు. దీక్షలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు భిక్షపతి మాదిగ, దోర్నాల రాజేందర్, అంతడుపుల సురేష్, మొగులయ్య కల్లెపల్లి కుమార్, సిలివేరి పవన్, బొక్క రవిశంకర్, విగ్నేష్, కిరణ్, భద్రయ్య, కృష్ణ, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు విటమిన్‌తో కూడిన ఆహారం


కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి

మొగుళ్లపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పుట్టిన పిల్లల నుంచి నాలుగేళ్ల వరకు అన్ని రకాల విటమిన్లతో కూడిన ఆహారం అందిస్తుందని సర్పంచ్ నైనకంటి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పిడిసిల్ల గ్రామం శనివారం అంగన్‌వాడీ సెంటర్‌లో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పిల్లలకు, గర్భిణులకు పోషకాహారాన్ని పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులకు, పిల్లలకు అందించి జవాబుదారీతనంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కట్కూరి ఐలయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవి, వెలుగు సమాఖ్య కార్యదర్శి కొండ్ర శోభ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు తదితరులు పాల్గొన్నారు .

విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపక బృందం

మహదేవపూర్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఓజోన్ డే సందర్భంగా విద్యార్థులతో పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. కళాశాలలోని అన్ని గ్రుపుల విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం విద్యార్థుల్లో 22 మంది విద్యార్థులు తమ తమ పోస్టర్లను ప్రదర్శించి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. రసాయన శాస్త్ర అధ్యాపకుడు రమేష్ మాట్లాడుతూ ఓజోన్ పొర సూర్యుని నుంచి వచ్చే అతిలోహిత కిరణాలను భుమిపై పడకుండా రక్షణ కవచంలా ఉంటూ సమస్త జీవరాశిని కాపాడుతుందన్నారు. ఓజోన్ పొర పోస్టర్ ప్రదర్శించిన విద్యార్థులకు గోల్డ్, కాంస్యం, పతకాలతో పాటు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, రాజు, పరుశురాములు, శ్రీనివాస్, రజిత, రమేష్, రాజేందర్, అస్ర సుల్తాన, మదురి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న జెడ్పీటీసీ సాగర్

చిట్యాల: మండలంలోని కొత్తపేట, పాసిగడ్డ తండా, సీఆర్‌పల్లి చిట్యాల గ్రామాల్లో నలుగురు లబ్ధిదారులకు రూ.1.35లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశాలతో స్థానిక జెడ్పీటీసీ గొర్రె సాగర్ అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పూర్ణచందర్ రావు రజిత రాజునాయక్, చింతల శ్వేతసుమన్, ఎంపీటీసీ కటుకూరి పద్మ నరేందర్, ధరావత్ రాజునాయక్, రాజునాయక్, బీసీ సెల్ అధ్యక్షుడు జాలిగాపు కిష్టయ్య సీనియర్ నాయకులు అల్లం రవీందర్, పాండ్రాల వీరస్వామి, రవీందర్ మార్కెట్ డైరెక్టర్ చిలుమాల రమణాచారి, టౌన్ అధ్యక్షులు బుర్ర శ్రీధర్ గ్రామ శాఖ అధ్యక్షుడు వేముల శీను పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ పంతకాని సమ్మయ్య

కాటారం : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల క్రీడామైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలను శనివారం ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యం అన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దాఢుడ్యత పెంపొందుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యతను వెలికి తీయడానికి ఎస్జీఎఫ్ క్రీడలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజం అని తమ ప్రతిభను ప్రదర్శించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ క్రీడల జిల్లా కార్యదర్శి సిరంగి రమేశ్, మండల కన్వీనర్ మంతెన శ్రీనివాస్, మేడిపల్లి ఆశ్రమపాఠశాల ప్రిన్సిపాల్ రవిశంకర్, ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

విజయభేరి సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి

భూపాలపల్లి రూరల్: తుక్కుగూడలో జరిగే విజయభేరి సభకు గ్రామాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు అధికసంఖ్యతో తరలిరావాలని టీపీసీసీ సభ్యులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం భూపాలపల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామం కమిటీ అధ్యక్షులు మామిండ్ల రాజు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తలు సమావేశానికి రాంరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఈనెల 17న రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ వేదికగా రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో జరిగే విజయభేరి భారీ బహిరంగ సభకు ములుగు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, ప్రజలు పార్టీ అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు , కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.